క్లుప్తంగా

భక్తులందరికీ కుంకుమ ప్రసాదం పంపిణీ చేపట్టాలి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులందరికీ కుంకుమ ప్రసాదం అందేలా చూడాలని ఈవో కె.ఎస్.రామరావు ఆలయ అధికారులకు సూచించారు. మహా మండపం ఆరో అంతస్తులో జరుగుతున్న కుంకుమ ప్యాకెట్ల తయారీని ఈవో మంగళవారం పరిశీలించారు. కుంకుమ ప్యాకింగ్ చేస్తున్న విధానం గురించి అడిగి తెలుసుకోవడమే కాకుండా కుంకుమ నాణ్యతను పరిశీలించారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు తొలుత అమ్మవారి దర్శనం ప్రశాంతంగా జరగాలని చూస్తారని, ఆ తర్వాత అమ్మవారి కుంకుమ ప్రసాదం దొరికితే మహా ప్రసాదంగా భావిస్తారన్నారు. దేవస్థానం చేపట్టిన ఉచిత కుంకుమ ప్రసాద పంపిణీని మరింత విస్తృతంగా జరిగేలా చూడాలన్నారు. ముఖ్యంగా శుక్ర, శని, ఆదివారాలలో భక్తులందరికీ కుంకుమ ప్రసాదం అందేలా అవసరమైన ప్యాకెట్లను సిద్ధం చేసి ఆలయంలో అందుబాటులో ఉంచాలన్నారు. రోజుకు ఎన్ని ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు.. ఎంత మంది సేవలకు తమ సేవలను అందిస్తున్నారనే వివరాలను ఏఈవో ఎస్.రమేష్‌బాబు ఈవోకు వివరించారు.

సూర్యభగవానుడికి విశేష పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ శివజ్ఞాన పీఠంలో మంగళవారం సూర్య భగవానుడికి విశేషంగా మందారం, నూరు వరహాలు, గులాబీ పూలు, శంకు పుష్పములతో పూజలు చేశారు. పీఠాధిపతి శివాచార్యస్వామి పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సూర్య భగవానుడి ఆశీస్సులు ప్రజలందరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని పూజలు చేస్తున్నట్లు తెలిపారు.

కూటమి అభ్యర్థులను చిత్తుగా ఓడించాలి

పాయకాపురం(విజయవాడరూరల్): సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా పిలుపునిచ్చారు. 61వ డివిజన్ శాంతినగర్‌లో ముస్లిం మైనార్టీల యువజన కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు ఉన్న రిజర్వేషన్లు తీసివేస్తామని చెబుతున్న కూటమి రాజకీయ పార్టీల అభ్యర్థులను ఓడించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీ వర్గాలకు చెందిన వారిని నామినేటెడ్ పదవుల్లో అనేక మందిని నియమించారన్నారు. సంక్షేమం పరంగా పెద్దపీట వేశారని అన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాసరావును ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అదేవిధంగా ముస్లింల సమస్యలను పరిష్కరించేందుకు ఆజాద్ ముస్లిం కమిటీ కృషి చేస్తోందని తెలిపారు. ఏఎంసీ సెంట్రల్ నియోజకవర్గ యూత్ సెక్రటరీగా గాలిబ్ బేగ్‌ను నియమించి ఆయనకు నియమాక పత్రం అందజేశారు. ఏఎంసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ, ప్రతినిధులు అన్వర్ బేగ్, సిలార్ బేగ్, షేక్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నేరగాళ్లను తరిమికొట్టాలి

- వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, ఆసిఫ్
- అరాచకాలు, కుట్రలు చేసే బ్యాంకు దొంగలకు చోటు లేదు
- మత సామరస్యానికి అండగా నిలవాలి
- పశ్చిమలో వైఎస్సార్ సీపీ భారీ ర్యాలీ



వన్‌టౌన్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న కేశినేని నాని, షేక్ ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి



ర్యాలీలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

వన్‌టౌన్(విజయజవాడపశ్చిమ): రానున్న ఎన్నికల్లో విజయవాడ పార్లమెంట్, పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న ఆర్థిక నేరగాళ్లను ప్రజానీకం తరిమికొట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌లు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సాయంత్రం పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ ర్యాలీని నిర్వహించారు. మంగళవారం సాయంత్రం భారీ గాలులు, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీని ముందుండి నడిపించారు. డప్పులు, డీజేల కోలహలం మధ్య యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జై జగన్, జై కేశినేని నాని, జై షేక్ ఆసిఫ్ అనే నినాదాలతో రోడ్లన్నీ మారుమోగాయి. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో పాటుగా వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ముందుకు సాగిన ప్రచార రోడ్ షో విజయోత్సవ ర్యాలీలా ముందుకు సాగింది. ర్యాలీలో అడుగడుగునా ఎంపీ కేశినేని నానికి, ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌లకు నియోజకవర్గ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ దేశంలో అత్యుత్తమమైన పరిపాలనను అందించిన ముఖ్యమంత్రుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు భాగాన ఉన్నారన్నారు. రాష్ట్రంలో అనేక పథకాలను తీసుకొచ్చి పేదరికాన్ని తగ్గించి పేదల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చారని చెప్పారు. ముఖ్యంగా నాడు – నేడు, ఇంగ్లిష్ మీడియం వంటి పథకాలు రాష్ట్ర భవితకు మార్గాన్ని సుగమం చేయనున్నాయన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా అడుగులు వేయిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావటానికి ప్రజలందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. దేశంలోని ప్రముఖ బ్యాంకులను టోకరా వేసిన వ్యక్తులను తరిమికొట్టాలన్నారు. ప్రధానంగా స్థానికుడు, ప్రజా సమస్యలపై అవగాహన కలిగిన షేక్ ఆసిఫ్‌ను ఎమ్మెల్యేగా ఎన్నుకొని అసెంబ్లీకి పంపించాలని కోరారు.

ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయండి

అరాచకాలకు కుట్రలు చేసే వ్యక్తులను తరిమికొట్టాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ కోరారు. పశ్చిమ నియోజకవర్గంలో ఎన్నో మతాలు, కులాలు సుదీర్ఘ కాలంగా కలిసిమెలిసి జీవిస్తున్నాయన్నారు. ఇక్కడ ఉన్న శాంతిని తమ కుట్రలతో బద్దలు చేయటానికి కొన్ని మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. ప్రధానంగా పశ్చిమ నియోజకవర్గంలో అనేక మంది మహనీయులు పోటీ చేసి శాసనసభ్యులుగా సేవలందించారని చెప్పారు. కానీ బ్యాంకు దొంగలను మాత్రం ఎన్నుకోలేదన్నారు. ప్రజాధనాన్ని దోపిడీ చేసి విలాసంగా జీవించే వ్యక్తులను ఎన్నుకోవటం ద్వారా ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పు వాటిల్లనుందన్నారు. ప్రజా జీవితంలో లేకుండా అనేక పదవులను డబ్బులను వెదజల్లి కొనుగోలు చేసిన వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమని హెచ్చరించారు. వారికి బుద్ధి చెప్పాలన్నారు. పదేళ్ల పాటు ఎంపీగా విజయవాడ నగరాభివృద్ధికి సేవలందించిన కేశినేని నానిని, తనను గెలిపించాలని కోరారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు జీఎంసీ బాషా, నరహరిశెట్టి శ్రీహరి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మనోజ్‌కొఠారి, షేక్ గౌస్‌మొహిద్దీన్, జమలపూర్ణమ్మ, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

80 శాతం ఓటింగ్ లక్ష్యంగా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్ సింగ్ బాలి, చిత్రంలో జేసీ సంపత్ కుమార్ తదితరులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): నైతిక విలువలతో కూడిన ఓటింగ్ దిశగా ప్రతి ఓటరూ పయనించాలని, తద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని మైలవరం నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు నరేందర్ సింగ్ బాలి పిలుపునిచ్చారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ గొల్లపూడిలోని డీటీసీ భవనంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచి నాయకులు రావాలంటే అది ఓటర్ల చేతుల్లోనే ఉంటుందన్నారు. ఓటు వేయడం ప్రతి భారతీయ పౌరుని బాధ్యత అని చెప్పారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ అనేది మహిళా ఓటర్లతోనే సాధ్యమవుతుందన్నారు. ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్, మైలవరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అలాగే గ్రామాల్లోని యువతీ యువకులు తమ ప్రాంతంలోని ఓటర్లను తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనేలా చైతన్యపరచాలని చెప్పారు. స్వీప్ నోడల్ ఆఫీసర్ వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ 50 శాతం మంది మాత్రమే నిజాయతీగా ఓటు వేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ఓటు వేయని మహిళ ఉండకూడదని పేర్కొన్నారు. గ్రామాల్లో 16 శాతం మంది ఓటింగ్‌కు రావడం లేదని, వారిని కూడా తీసుకు రావాలని ఎస్‌హెచ్‌జీ మహిళలకు సూచించారు. రూరల్ ఎంపీడీఓ రమ్యశ్రీ మాట్లాడుతూ తమ పరిధిలోని మహిళలు తప్పనిసరిగా ఓటు వేసేలా డ్వాక్రా మహిళలు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా తొలుత కళాజాతా స్కిట్స్, ఫ్లాష్‌మాబ్ ద్వారా పిచ్చయ్య, డప్పు రమేష్ ఓటర్లకు అవగాహన కల్పించారు. చివరిగా డ్వాక్రా మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శేషగిరిరావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు లియోనా, జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

300 మద్యం సీసాలు స్వాధీనం

పోలంపల్లి(వత్సవాయి) : మండలంలోని పోలంపల్లి పంట పొలాల్లో బస్తాల్లో దాచి ఉంచిన 300 మద్యం సీసాలను ఎక్సైజ్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పొలాల్లో మద్యం సీసాలను నిల్వ చేశారనే సమాచారం తెలుసుకున్న ఎస్ఈబీ సీఐ మణికంఠ, తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 300 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా మద్యం దాచినవారి వివరాలను కనిపెట్టి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని సీఐ వివరించారు.

ప్రజలను మరోసారి మోసం చేసేందుకే కూటమి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్
- కూటమివి మూడు మేనిఫెస్టోలు
- 48వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ విస్తృత ప్రచారం



48వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్, కేశినేని శ్వేత, అడపా శేషు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ప్రజలను మరోసారి మోసం చేసేందుకే టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి వస్తున్నామని, మూడు పార్టీలు కలిసినా మూడు మేనిఫెస్టోలను ప్రజల ముందు ఉంచారని వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్, ఎంపీ అభ్యర్థి కేశినేని నాని కుమార్తె శ్వేత పేర్కొన్నారు. నియోజక వర్గంలోని 48వ డివిజన్‌లో మంగళవారం వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, షేక్.ఆసిఫ్ విజయాన్ని కాంక్షిస్తూ కేశినేని శ్వేత డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి, పెదబాబుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార కార్యక్రమంలో షేక్.ఆసిఫ్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, కేశినేని శ్వేతలతో పాటు పలువురు పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. డివిజన్‌లోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించిన పార్టీ నేతలకు ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. పలు ప్రాంతాల్లో ప్రజలు నేతలకు హారతులిచ్చి స్వాగతం పలికారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు ప్రజలు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారన్నారు. కొండ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలతో పాటు ప్రజలకు మంచినీటిని అందించేందుకు రిజర్వాయర్ నిర్మించామని చెప్పారు. జగనన్నను గెలిపించుకుంటామని, ఎంపీగా కేశినేని నాని, ఎమ్మెల్యేగా ఆసిఫ్‌ను గెలిపించుకోవడం మా బాధ్యతని ప్రజలు భరోసా ఇస్తున్నారన్నారు.

పీఎం నగరానికి ఏం చేశారో చెప్పాలి..

పశ్చిమలో ప్రజలను మభ్య పెట్టేందుకు హైదరాబాద్, ఢిల్లీ నుంచి స్కామర్లను, లాబీయింగ్ చేసే వాళ్లకు ఇక్కడ అవకాశం ఇచ్చారని ఆసిఫ్ ధ్వజమెత్తారు. కూటమిగా మూడు పార్టీలు పని చేస్తున్నా.. ప్రజలకు తాము ఏం చేస్తారో చెప్పలేకపోతున్నారని, సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి తాను చేసే పనులను మేనిఫెస్టో రూపంలో చక్కగా వివరించారన్నారు. కూటమికి నగరంలో ఆదరణ లేదని, తొలుత విజయవాడలో భారీ ర్యాలీ అని చెప్పిన నేతలు ఇప్పుడు 1.3 కిలోమీటర్లకే పరిమితం చేయడంపై ఎద్దేవా చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నగరానికి ఏం చేశారో ఆ పార్టీ నేతలకు ప్రజలకు తెలపాలని నిలదీశారు. సొంత లాభం కోసమే మూడు పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయని, ఈ కూటమి వల్ల ప్రజలకు ఏం ప్రయోజనమని ప్రశ్నిస్తున్నామన్నారు.

విజయవాడ వెస్ట్‌ను బెస్ట్‌గా చేస్తా, సింగపూర్‌గా చేస్తామని తప్పుడు మాటలు చెబుతున్నారన్నారు. ప్రజలు టీడీపీ, జనసేన, బీజేపీ చెప్పేది... చేసేది అంతా గమనిస్తున్నారని, ప్రజలందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్. మెహరాజ్, అయితా కిశోర్, కోళ్ల రజనీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్
- 55వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఆసిఫ్, నాయకులు

వించిపేట(విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్.ఆసిఫ్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం 55వ డివిజన్ ఎర్రకట్ట కొండ ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్ శీరంశెట్టి పూర్ణచంద్రరావుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్ని పథకాలు ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఇచ్చేవారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎటువంటి పక్షపాతం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించారని చెప్పారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అన్నారు.

కోట్లాది రూపాయలతో అభివృద్ధి..

కోట్లాది రూపాయలను వెచ్చించి 55వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అవకాశవాదులను, ఆర్థిక నేరస్తులను నమ్ముకున్న బీజేపీకి భంగపాటు తప్పదన్నారు. ప్రజలకు ఒక్క మంచిపని చేశానని చెప్పుకొలేని చంద్రబాబు ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో ఏ ప్రాంతంలో ఏ సమస్య ఉందో కూడా తెలియని సుజనచౌదరి నియోజకవర్గాన్ని ఏవిధంగా అభివృద్ధి చేస్తారో ప్రజలు గమనించాలన్నారు. అమరావతి అభివృద్ధి పేరుతో పేద రైతుల నుంచి వందలాది ఎకరాలను అక్రమంగా దోచుకుని వారి పొట్టకొట్టిన చంద్రబాబును రైతులు క్షమించరన్నారు. ఒంటరిగా గెలవలేమని తెలిసి కూటమిగా వస్తున్న టీడీపీ, బీజేపీ, జనసేనా పార్టీలకు ఓటమి తప్పదన్నారు. ఎంపీగా రెండు సార్లు, కేంద్ర మంత్రిగా మూడేళ్లు పనిచేసిన సుజనచౌదరి పశ్చిమ నియోజక వర్గంలో ఏ అభివృద్ధి పని చేశారో చెప్పాలన్నారు. డబ్బుతో గెలవాలని చూసే ఆయనకు నియోజకవర్గ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, పార్టీ నాయకులు సుభానీ, షేక్.సలీమ్, వెంకటలక్ష్మి, పద్మ, దుర్గాభవానీ, సునీల్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు

ఘనంగా అల్లూరి వర్ధంతి



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో నేటి యువత దేశానికి సేవ చేయాలని ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక బుడమేరు వంతెన సెంటర్‌లో మంగళవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి లఖంరాజు సునీత ఆధ్వర్యాన అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని స్థానిక కార్పొరేటర్ బి.జానారెడ్డితో కలిసి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు వర్మ, వికాస్, పెద్దబాబు అమ్ముల వివేకానంద తదితరులు పాల్గొన్నారు. గిరిజన హక్కుల కోసం పోరాడి, వారిలో స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగం తెలుగు జాతికే గొప్ప గౌరవమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుడమేరు వంతెన వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు.

ముత్యాలంపాడులోని గోకరాజు రంగరాజు కల్యాణ మండపంలో అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం, అల్లూరి స్మారక గ్రంథాలయం ఆధ్వర్యాన మంగళవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా అల్లూరి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం 300 మందికి అన్నదానం చేశారు. మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు, సంఘం అధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వరరాజు, కార్యదర్శి ప్రసాదరాజు, గ్రంథాలయం అధ్యక్షుడు కే సుబ్బరాజు, డాక్టర్ ఎస్వీ సుబ్బరాజు, కార్యదర్శి పీవీ సుబ్బరాజు, క్షత్రియ సౌత్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు టీవీఎస్ ఆంజనేయరాజు, కోశాధికారి డీజేపీఎస్ రాజు, టీపీఎస్ రాజు, టి.శ్రీనివాసరాజు, సాగి వర్మ, డాక్టర్ రామలింగరాజు, కె.సాంబశివరాజు పాల్గొన్నారు.

• ఈదురుగాలుల బీభత్సం



నగరంలో కమ్మేసిన మబ్బులు



గాలులకు నిర్మానుష్యంగా మారిన పంటకాలువ రోడ్డు

నగరంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఉదయం నుంచి భానుడి భగభగలతో అల్లాడిన ప్రజలు సాయంత్రం వాతావరణం చల్లబడడంతో సేదతీరారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఈదురుగాలులు వీచి, మబ్బులు కమ్మేశాయి. కొన్ని ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఊడిపోయాయి. పంటకాలువ రోడ్డులో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. వెంటనే అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు.

–ఆటోనగర్(విజయవాడతూర్పు)

ఇండ్ గ్యాప్ పొలంబడితో రైతులకు మేలు



జి.కొండూరు: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇండ్ గ్యాప్ పొలంబడితో రైతులు ఆర్గానిక్ పద్ధతిలో మేలైన దిగుబడులు పొంది విదేశాలకు నేరుగా ఎగుమతి చేసుకునే వీలు కలుగుతుందని వ్యవసాయ కమిషనరేట్ డీడీఏ బాలునాయక్ తెలిపారు. మండల పరిధి కుంటముక్కల గ్రామంలో వైఎస్సార్ గ్యాప్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా మేలైన సాగు పద్ధతులపై శిక్షణ పొందిన రైతులు సాగు చేస్తున్న రబీ వరిపైరును బాలునాయక్‌తో పాటు ఏపీఎస్ఓపీసీఏ నుంచి డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ యుగంధర్, స్టేట్ వైఎస్సార్ పొలంబడి ఏడీఏ వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. శిక్షణ పొందుతున్న పదిమంది రైతులు పండించిన రబీ వరి పైరు నుంచి ధాన్యం శాంపిల్స్‌ను సేకరించారు. బాలునాయక్ మాట్లాడుతూ ఈ శాంపిల్స్‌ను పరీక్షలు జరిపిన అనంతరం ధాన్యంలో నిబంధనలకు లోబడి రసాయనిక అవశేషాలు ఉన్నట్లు తేలితే రైతులు తమ ధాన్యాన్ని విదేశాలకు ఎగుమతి చేసుకునేలా సర్టిఫికెట్‌లను అందజేస్తామన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలోని కళావేదికపై మంగళవారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. తెనాలికి చెందిన శ్రీలక్ష్మి కూచిపూడి నృత్య కళా కేంద్రం నిర్వాహకురాలు, నాట్యాచారిణి ఎ.వెంకట లక్ష్మి శిష్యులు మహాగణపతి, నమఃశివాయ, అంబ నీరాజనం, అష్టలక్ష్మి వైభవం, జయ జయ దుర్గ, మార్కేండేయ విజయం, అర్ధనారీశ్వరం హనుమాన్ చాలీసా వంటి అంశాలకు చక్కని ఆహార్యం, అభినయంతో నృత్యం చేశారు. అనంతరం ఆలయ అధికారులు కళాకారిణులకు తీర్థప్రసాదాలు అందజేసి, అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు.



కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారిణులు

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి అన్నారు. ఎంపవరింగ్ యూత్ ఫర్ డెమోక్రటిక్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ రూపొందించిన ప్రచార పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఎన్నికల్లో ప్రలోభాలకు తలొగ్గకుండా దేశ ప్రగతి కోసం ఆలోచించి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల్లో కుల, మత, ప్రాంతీయ తత్వాలకు ప్రజలు గురికాకుండా చైతన్య వంతులను చేసేందుకు, యువతను రాజకీయంగా ప్రోత్సహించేందుకు ఎంపవరింగ్ యూత్ ఫర్ డెమోక్రటిక్ ఇండియా సంస్థ చేస్తున్న కృషిని సీఐ అభినందించారు.